ప్రియమైన జయా,

నీ వుత్తరం చేరింది. త్వరగా జవాబు వ్రాసినందుకు సంతోషం. నీవు చదువుకున్న దానివనీ, చాలా తెలివైనదానివనీ, సంస్కారం గల బుద్ధి నీకున్నదనీ మొదలు అనుకునేవాడ్ని. కాని నీ ఉత్తరం చూశాక నాది పొరపాటనిపించింది. నన్ను బాగా అర్థం చేసుకున్నావనీ, ఎంతయినా చిన్నప్పటినుండీ తిరిగిన స్నేహితులం-మన మనసులు మనకు తెలుసనీ అనుకున్నాం. కాని నా అంచనా తప్పని తేలింది.

మురళి నీకు చేసిన అన్యాయం గురించి వ్రాశావు. ప్రతివాని జీవితంలో కొన్ని అలాంటి ఘట్టాలు రావడం జరుగుతుంది. మీకు కలిగిన 'బాబు'ను అనాథశరణాలయంలో ఎందుకు చేర్పించావు. మన పెండ్లయిన తర్వాత మనమే పెంచుకోవచ్చుగా! నీ కేమిటి అభ్యంతరం.

జయా! నేను నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమించినట్లు వ్రాశాను. నిన్ను ప్రేమించినపుడు నీలోని మంచినీ... చెడునీ కూడా ప్రేమించాలి గదా! నీలోని 'మంచి'నే కోరుకుంటే 'చెడు' ఎటుపోవాలి... అలాంటి పిచ్చిభ్రమలు పెట్టుకోకు ... నీ ఉత్తరం చేరగానే ముహూర్తానికి ఏర్పాట్లు చేయించగలను. త్వరగా జాబు వ్రాయగలవు.

—సారథి.

* * *

మురళీ ..

నీవు క్షేమమని తలుస్తాను. నీ కో ముఖ్యవిషయం వ్రాయవలసివచ్చింది. కొద్దిరోజులు తేడాతో నీదగ్గరనుండి - సారథి దగ్గరనుండి ఉత్తరాలు వచ్చాయి. ఇద్దరూ నాకు కావలసినవాళ్ళే... ఇద్దరూ వివాహం చేసుకోమని అడిగారు. నీకు సారథి గురించి వ్రాసినటువంటి ఉత్తరాన్ని, నీ గురించి సారథికికూడా ఒకటి వ్రాశాను. ఇద్దరి జవాబులూ చదివాను. మన స్నేహాల్లో మనసుల్లో గల భేదాల్ని గుర్తించేటందుకుగాను ఈ ఉత్తరా లన్నీ నీకు పంపిస్తున్నాను. ఒకసారి తీరికగా చదువగలవు.

'శుభలేఖ' పంపిస్తాను. పెండ్లికి తప్పకుండా వస్తావుగదూ!

— జయ.

——

# బహుమతి

యం. ప్రభాకర రావు



"పద్మా! ఇది చూశావా!" అంటూ చేతిలో పత్రికతో గదిలోని కడుగు పెట్టింది అరుణ.

ఉలిక్కిపడ్డాను. చూస్తున్న పత్రికలో నుండి దృష్టి మరల్చలేక "ఏమిటే" అన్నాను.

"ఆవురావురుమంటూ అంత శుభవార్త మోసుకొస్తే 'ఏమిటే' అంటూ రాగాలు తీస్తావేమిటి...అబ్బ! అంత దీక్షగా దేవిగారు చదువుతున్నదేమిటో?" నా రెండుభుజాలపైనా చేతులు వేస్తూ అంది అరుణ.

చేతిలోని పత్రికను మూసివేస్తూ "అఁ! ఇప్పుడు చెప్పు, అంత శుభవార్తయేమిటో!" అన్నాను దాని రెండు చేతులూ పట్టి సోఫాలో కూర్చొబెడుతూ.

దాన్ని చూడగానే మతిపోయింది. గుడ్లప్పగించి చూస్తూవుంది, మాటా మంతీ లేకుండా. "ఏమిటే, శుభవార్త అంటూ వురుకులు పరుగులతో వచ్చిన దానివి ఇలా మూగదాని వయ్యావేమటి?" అంటూ గబగబా కూజాలోని మంచినీళ్ళు గ్లాసులోకి వంచి దాని

నోటి కందించాను. గబగబా త్రాగే సింది. మళ్ళీ మామూలుమని షయింది.

"ఆఁ! ఇప్పుడుచెప్పు." అంటూ ప్రక్కనున్న పేపరుతో విసరసాగాను, మళ్ళీ వెధవేషా లేస్తుందేమోనని.

"ఏమీలేదు; తమ అభిమాన రచయిత శ్రీ ప్రకాశరావుగారి రచనను సచిత్రంగా ప్రచురించిన పత్రికను చూపించాలని వస్తే, అప్పటికే కనురెప్ప వేయకుండా చూస్తున్నావు ఆయనగారి ఫోటోని," అంటూ నవ్వ సాగింది.

"ఛ! పోవే!" అన్నాను. ఏదో సిగ్గుగా అనిపించింది.

నిజమే! ఆయన నా అభిమాన రచయితే. ఆయన రచనలన్నీ నా హృదయానికి చాలా దగ్గరగా వుంటాయి. భావాలుకూడా ఇంచుమించు ఒక్కలాగే వుంటాయి. అందుకేనా ఇంత అభిమానం అంటే, ఏమో చెప్పలేను. ఆయన వ్రాసి ప్రచురించిన ప్రతిరచనా నాకెంతో యిష్టం. అలాగే ఇష్టంతో చదువుతానుకూడా. ఆయన ముఖపరిచయ మెప్పుడూ కలగలేదు. కాని యీనాడు ఆయన రచనతో పాటు ఆయన ఫోటోనీ, జీవిత విశేషాల్నికూడా ప్రచురించారు. ఆయన కథల్లాగే ఎంత అందంగా వున్నాడు. ఇంకా పెళ్ళికూడా కాలేదట - ఛ! ఏమిటి ఇలా ఆలోచిస్తున్నాను. సిగ్గు ముంచుకొచ్చి నవ్వొచ్చింది.

"ఇంతకీ ఏం వ్రాశాడేమిటి ఆ రచనలో?" అంటూ క్వెశ్చన్మార్కు ముఖం పెట్టింది అరుణ.

"అరుణా! నిజంగా ఆయన సంఘాన్ని వుద్ధరించడానికి ఇన్ని విధాల రచనలు చేస్తున్నారుకదా! దీనివల్ల ఎంతవరకు సంఘం బాగుపడుతుం దంటావు. ఎంతమంది తల్లిదండ్రులు తమ కొడుకులకు కట్నం లేకుండా పెళ్ళిళ్ళు చేస్తున్నారు. దీనికి ఎంతమంది యువకులు ముందడుగు వేస్తున్నారు;" మనసులో ఆవేశాన్ని అణచుకోలేకపోయాను.

"ఏమోబాబూ! చెప్పేవాళ్ళే చెయ్యని ఈరోజుల్లో వినేవాళ్ళు చేస్తారంటే నమ్మలేను. ఈలోకం మారుతుందనుకోవడం వట్టిభ్రమ."


నిజమే! అరుణ చెప్పిందికూడా సబబే. నిజంగా చెప్పేవాళ్ళెవ్వరూ చెయ్యరు!...... అలాంటప్పుడు సంఘాన్నింతగా ఉద్ధరించాలనే ఈయనకూడా తనవంతు వస్తే అడుగు ముందుకు వేయగలడా?

"అరుణా! మరి ఈయనకూడా అందరిలాగే చెప్పినవి చేసేవాడు కాడంటావా?"

అరుణ రెండుతుంటరి సాకళ్ళలోకి చూసింది; విచిత్రంగా నవ్వింది.








"ఏమో? ఎలా చెప్పగలం! అయితే ఒకపని చేద్దాం ఆగు," అంటూ గబగబా పెన్ను తీసి ఏదో రాయసాగింది.

"శ్రీ ప్రకాశరావుగారికి,

నేనెవరో మీ రెరుగరు. కాని మీ రచనలద్వారా నేను మీకతి సన్నిహితురాల్ని. దేవుడు చేసిన అన్యాయానికీ, లోకం చేస్తున్న అపహాస్యానికీ ఆహుతి అవుతున్న ఒక అబలను. ఇలాంటి పరిస్థితులలో మీ రచనలు చదవటం తటస్థించింది. నాలాంటివారికి మీ రచనైనా దారి చూపించగలరనే నమ్మకంతో మీకీ జాబు వ్రాస్తున్నాను.

పుట్టింది పేదకుటుంబంలో; దానికి తోడు చిన్ననాడే తల్లిదండ్రులను పోగొట్టుకున్నాను. ఉన్న ఒక్క అన్నయ్యే తల్లిదండ్రీయై పెంచాడు. తప్పటడుగులు వేస్తున్న తరుణంలోనే మెట్లపైనుండి జారిపడి కాలు విరగ్గొట్టుకున్నాను. పాదం మడతపడ్డందువల్లా, వైద్యం సరిగ్గా లేనందువల్లా అవిటిదాన్నయ్యాను. దీనికి అలంకారమేమో అన్నట్లు భగవంతుడు కటిక చీకటిలాంటి కారునలుపును ప్రసాదించాడు. స్కూల్లో ఎక్కువరోజులు చదవలేకపోయాను. తోటిపిల్లలంతా "కుంటి గుర్రం", "నల్లకాకి" అంటూ వెక్కిరిస్తూంటే దుఃఖాన్ని ఆపుకోలేక ఇంటికి పరిగెత్తుకొచ్చేదాన్ని. ఏడుస్తున్న నన్ను అన్నయ్యే ఓదార్చేవాడు. నన్ను బడి మానిపించి ఇంట్లోనే ఒక ట్యూషన్ మాస్టారు నేర్పాటుచేశాడు.

అన్నయ్య పెళ్ళయింది. వదినా అన్నయ్యలు నాకోసం సంబంధాలు

వెదకసాగారు. చాలామంది చూసి వెళ్లిపోయారు. కాని ఒక్కరైనా చేసుకుంటామని ముందుకు రాలేదు. అంతవరకూ ఎంతో ప్రేమగా వుండే అన్నయ్యకూడా ఇప్పుడు పలకరించడమే మానేశాడు. వదిన చెప్పే చాడీలకు నన్ను చీవాట్లు పెట్టడం కూడా ప్రారంభించాడు. నా పెళ్ళి సంబంధాలు ఏనాడో వెదకడం మానేశారు. నా వెక్కిళ్ళు చప్పుడు నేనే వింటూ, నాకై నిర్దేశింపబడిన ఆ చీకటి గదిలో కలిసిపోయి విలపించని రోజు లేదు. తిన్నావా అని అడిగేవారే కరువైపోయారు. ఆకలయితే ఒక్కత్తినే వెళ్లి తినాలి; లేకుంటే ఆగదిలో పడుకోవడం. ఇంటికొచ్చే పత్రికలు చదువుతూ నా దురదృష్టాన్ని నిందించుకునే సమయాల్లో మీరచనలు నాకెంతో అహ్లాదాన్ని కలిగించాయి. ఆ ఆనందంలోనే నాలాంటిదాని కొక దారి చూపించగలరేమో అనే ఆశకూడా ఆవిర్భవించింది. ఆ ఆశతోనే బతికిన నా జీవితాన్ని మీముందు పరిచాను. కనికరించి దారి చూపిస్తారనే ఆశిస్తున్నాను.

వేయికళ్ళతో, కోటి ఆశలతో మీ జవాబుకై నిరీక్షిస్తున్న —

ఒక దీనురాలు, పద్మ."

పెన్ను మూసివేస్తూ, పేపరు నాచేతి కిచ్చింది అరుణ.

"అరుణా! నీవుద్దేశం," అన్నాను అర్థంకాక.

"ఏంలేదు పద్మా; ఆయనగారికిదొక పరీక్ష. సరే! రేపు కాలేజీ కెళ్లేప్పుడు పోష్టుచెయ్యి ఈలెటర్‌ని," అంటూ నవ్వింది అరుణ.

## 2


వారం తిరక్కుండానే జవాబొచ్చింది ప్రకాశరావుదగ్గర్నుంచి.

"ప్రియమైన పద్మకు,

హృదయాన్ని కరిగించే మీవుత్తరం అందింది. మీ బాధను అర్థం చేసుకున్నాను. భగవంతుని దృష్టిలో అందరూ సమానులే. బాహ్య సౌందర్యం లేనివారికి అంతర్‌సౌందర్యాన్ని ప్రసాదించాడు. నల్లని కోయిలకు తియ్యని కంఠాన్నీ, చెల్లని కాకులలో చెరగని ఐకమత్యాన్నీ చిత్రంగా చిత్రించిన చిత్రకారుడు ఆ కరుణామయుడు, చెదిరిన మీరూపంలోని స్వచ్ఛమైన మీ హృదయం నా కవగత మయ్యింది.

నా ఆశయాల కనువైనమార్గం, నా భావాలకు నిజమైనరూపం ఏర్పడబోతోంది. నేను మిమ్మల్ని పెళ్ళి చేసుకుంటాను. నామాట నమ్మండి. పెళ్ళి చేసుకునేముందు మీగురించి నేనెలా తెలుసుకున్నానో, నా గురించికూడా మీరు తెలుసుకోవడం అవసరమని






భావిస్తున్నాను. నా గురించిన జీవిత విశేషాల్ని మీరు చదివేవుంటారు, కాని ఎవ్వరికీ తెలియని రహస్యం ఒకటుంది:

సరిగ్గా ఐదు సంవత్సరాల క్రితం ఒకనాడు బి. ఏ. రిజల్ట్స్ చూసి ఇంటికొస్తున్నాను ఆనందంగా! ఆ ఆనందంలో అతిచేరువలో ఉన్న అపాయాన్ని గ్రహియించలేకపోయాను. గ్రహియించేలోపునే ఆక్సిడెంటుకు గురయ్యాను. కుడికాలు విరిగింది. బలమైన గాయాలు తగిలాయి. ఫలితంగా కుంటివాడి నయ్యాను. చేతికర్ర సాయంలేనిదే ఎక్కడికీ వెళ్ళలేను. కావలసినంత ఆస్తి వుంది. కాని కాళ్ళు లేవు. నాసంపద మాటున నా అవయవ లోపం దాగిపోయింది. నాకు పిల్లల నిస్తామనే మామలు కోకొల్లలు. పిల్లలు నా ఆస్తికోసం నన్ను చేసుకోవడానికి ఆరాటపడుతున్నా రని నాకు తెలుసు. మమతలు లేని మనుషులు నా కవసరం లేదు.

సరే; మీకోసం రేపు సాయంత్రం టాంకుబండ్‌పై నారింజరంగు కారులో నిరీక్షిస్తుంటాను. గుర్తుపట్టటానికనువుగా ఈ ఆకుపచ్చని లెటర్‌ని మీ చేతిలో వుంచుకోండి. నా హృదయ ద్వారాలన్నీ తెరిచి అహ్వానిస్తున్నాను. మనస్పూర్తిగా నన్ను నమ్మండి.

ఇట్లు

మీవాడు— ప్రకాశ్"

అపుకోలేని దుఃఖంతో మంచంపై వాలిపోయాను.

"పద్మా! లే, లే. ఏమి టిది?" అంటూ అరుణ తట్టి లేపేసరికి కళ్ళు తెరిచాను. దిండు తడిసిపోయింది?" అరుణచేతిలో ఆకుపచ్చని లెటరుంది.

"ఇంతమాత్రానికే ఏడుస్తున్నావా? నిజంగా ఆయన మనపరీక్షలో నెగ్గడమే కాదు, మహానుభావుడనికూడా నిరూపించుకున్నాడు. ఇంతటితో ఈ నాటకాన్ని ఆపేద్దాం..." అంది.

"అరుణా!"

"అవును పద్మా? నిజంగా "కుంటి గుర్రం, నల్ల కాకి" పద్మ లేదుగా! మనం ఆడిన నాటకానికి క్షమించమని రేపే రాసేద్దాం."

"అరుణా! లేదు. అలా జరగడానికి వీల్లేదు. పాపం! అయన దేవుడు చేసిన నేరానికి గురై ఎంత బాధపడుతున్నాడో. కుంటిదాన్నని, మసిబొగ్గునని, ఏమీలేని పేదరాలినని తెలిసికూడా అసహ్యించుకోకుండా పెళ్ళికి ఒప్పుకున్నాడంటే ఎంతటి ఉన్నత హృదయం ఆయనది. అటువంటి మహానుభావుని సేవలో తరించడం కన్నా ఆనందం ఏముంది? నా అభిమానంలో అనురాగం వుందని ఇప్పుడే తెలుసుకున్నాను."

"పద్మా!"

"అవును. రేపు అక్కడికి వెళ్ళడానికే నిశ్చయించుకున్నాను."

## 3

అస్తమించే సూర్యభగవానుడు బంగారు రంగులో హుస్సేన్ సాగరులోని అద్దంలో ప్రతిబింబిస్తున్నాడు. ఆ నీటిలో బంగారు అలలు లేచి పడుతున్నాయి. అలలపైనుండి వస్తున్న పిల్లగాలులు టాంక్‌బండ్‌పై విహారానికొచ్చేవారికి వీవనలు వీస్తున్నాయి.

అప్పుడే వచ్చి ఆగిన నారింజరంగు కారులోంచి బయటికి తొంగిచూశాడు ప్రకాశరావు.

రిక్షా దిగినపద్మ చీరకుచ్చెళ్లు సవరించుకొని చుట్టూ పరికించిచూసింది. అల్లంతదూరంలో నారింజరంగుకారు కనిపించగానే ఆమెమనసు చంద్రుడ్ని చూసిన కలువలాగా వికసించింది. పెదవులపై సిగ్గుతోకూడిన చిరునవ్వు విరబూసింది. ఆ కారువైపు అడుగులు వేయసాగింది. తెల్లనిచీరతో, బంగారు రంగుతో వింతగా మెరిసిపోతోంది, పదహారేళ్ళ పద్మ – చేతిలో ఆకుపచ్చని లెటరుతో.







కారులో కూర్చున్న ప్రకాశ్ అటువైపు వస్తున్న పద్మను ఆశ్చర్యంగా చూడసాగాడు. అనుమానంతో కళ్ళు నులుముకున్నాడు. తిరిగి ఆమె చేతివైపు చూశాడు. చేతిలో ఆకుపచ్చని లెట రుంది.

కారును చేరుకుంటున్నపద్మ కారు దిగి ముందుకు నడిచివస్తూన్న పొడవైన తెల్లనిసూటులో వున్న వ్యక్తిని అనుమానంగా చూసింది. అతనే సందేహంలేదు. మరి ఆయన కాళ్ళు......

అడుగు దూరంలో ఉన్న పద్మను చూస్తున్న ప్రకాశ్ "మీరు..." అంటూ ఒకడుగు ముందుకు వేసి ఆగిపోయాడు.

అడుగులు ముందుకు వేస్తున్న ప్రకాశ్‌ని చూస్తూ "మీరు..." అంటూ ఆగిపోయింది పద్మ.

ఇద్దరూ ఒక్కసారి బిగ్గరగా నవ్వుకున్నారు.